# అరణ్యా రోదనం

"బావా! పూర్ణానందం! చెప్పేది వినిపించుకో. నేరం ఒప్పుకో. అందరెదుటా ఒప్పుకో. మిత్రులు, శత్రులు, ఆశ్రితులు, పెద్దలు, పిన్నలు, ఆఫీసర్లు, న్యాయస్థానం, శిష్యులు, గురువులు, కుటుంబ సభ్యులు అందరెదుటా ఒప్పుకో. అదే బ్రేవ్‌మాన్ చేసే పని. బావా! ఆనందం! ఈ శరీరమే ఆత్మ అనుకుంటున్నావు. నింద, శిక్ష, అవమానం, మృతి అనేవి యీ శరీరానికి గాని ఆత్మకు గాదు. శరీరాన్ని కాపాడుకుని, దాన్ని గౌరవిస్తున్నానని, భ్రమలో పడి, ఆత్మవంచన చేసుకోకు. ఆఫీసర్లు చెప్పే సలహా పాటించకు. ఆశ్రితులు పల్కేది అసత్యం. సత్యం గుర్తించు బావా పూర్ణా! పరిపూర్ణుడివి కావాలంటే ఆత్మఘోష వినగలగాలి. నీ అంతరాత్మ నా రూపంలో వచ్చి చెపుతున్నది. నా నోరు నొక్కేయకు. భగవంతుడెప్పుడూ నీకు ప్రియమైనవాళ్ళ రూపంలో వచ్చి నొప్పిస్తూ సత్యం చెపుతాడు. యేపాటి మనోబలమున్నదని పరీక్షిస్తాడు. తనను గుర్తించగలవా లేదా అని చూస్తాడు. బావా! పూర్ణానందం! యెంత ప్రేమగా, యెంత ముద్దుగా శ్రద్ధగా పెంచావు నన్ను దేనికి పెంచావు, తల్లీ దండ్రీ ప్రమాదంలో పోయి నేను బతికిందిందుకేనా? విని వూరుకోక ప్రమాద స్థలానికెందుకొచ్చావు. నా తల్లి దండ్రులకి, చెల్లెలూ బావమరిదీ అని, శాస్త్రీయంగా అపరకర్మలు చేయటం నీకు ధర్మంగా తోచింది. కన్నబిడ్డలని ప్రేమించుకోవాలని తెలియటం లేదు. నువ్వు నీ నేరం నలుగురెదుటా ఒప్పేసుకుంటే, భగవంతుడు సంతోషించి, నీ బిడ్డలను అభివృద్ధిలోకి తెస్తాడు. యెంత అందమైన బిడ్డలనిచ్చాడు నీకు భగవంతుడు. పువ్వు పుట్టగానే పరిమ

శిస్తుందని, వారి తెలివితేటలూ వెల్లడైనాయి. వారి భవిష్యత్తును గురించి ఆలోచించు. నీ అవమానం గురించి ఆలోచించకు. నేను ఆస్థాన విద్వాంసుడిని కాననుకో. నాకు శాలాలు, సలాలు, పదవీ హోదా లేవనుకో. కాని నీ మీదున్న గౌరవం భక్తీ ప్రేమా యిలా చెప్పిస్తున్నాయి. శిక్ష పంచాయితీకి అనుమతించు. ప్రమాదవశాత్తూ పోయిందని తేలుతుంది. ఉద్రేకంలో, మనస్సు వికలమై కొట్టానని చెప్పు. కుట్రపన్ని పథకం వేసి చంపలేదని చెప్పు. థర్డ్ డిగ్రీ మర్డర్ అని తేలిక శిక్ష పడుతుంది. మహా అయితే ఆరేళ్ళు వేస్తారు. సత్ప్రవర్తనకు అదీ తగ్గుతుంది. మెర్సీ పిటీషన్ పెట్టించి అదీ తప్పిస్తాను. ఒకవేళ కటకటాల వెనుకకు వెళ్ళాల్సి వస్తే, సామాన్య ఖైదీలాగా, నేరస్థునిలాగా కాలం గడుపు. యే దారుణమూ చేయని రాజకీయ ఖైదీలు జైలు జీవితం గడపలేదా? అలా చేయగలిగితివా నిష్కృతి అంగీకరించినట్టే. పరిహారం చెల్లించినట్టే. కోపం నిన్ను బాగా లొంగదీసింది. అహం వోడించింది. పరిస్థితికి భయపడిపోయినావు. ధైర్యం తెచ్చుకో.

భగత్‌సింగ్‌ను బాంబు విసరటానికి యెన్నుకున్నప్పుడు, 'వాడు వెళ్ళద్దన్నాడు, పార్టీ యేమవుతుంది? మరొకడిని యెన్నుకుందాంలే అన్నాడు, వెళ్ళను.' అన్నాడట భగత్. నిజమైన స్నేహితుడది విని నవ్వాడుట. పార్టీ నిలకడ నీ చేతుల్లో వున్నదా. నువ్వు లేకపోతే చితికిపోతుందా? నీ మొహాన యేమి రాసి వున్నదంటే, నిన్ను పట్టుకుంటారు. విచారణ చేస్తారు. 'భగత్ లీడరేగాని, పిరికి. మరొకరిని ముందుకు తోలి తాను దాక్కుంటాడు. ప్రాణభీతి యెక్కువ' అం

టాడు మేజస్ట్రేట్. ఇదివరకొక మిత్రునికీ అవమానం జరిగింది. వాడు చాలా బాధపడ్డాడు. వెళ్ళితేనే బాగుండేదే అని వాపో యాడు. మిత్రమా!'. భగత్‌కి కోపమొచ్చి, 'నీ నాలుక కోసేయాలి.' అన్నాడుట. 'యేమైనా చేయి. నిజమైన మిత్రునిగా నేను నీకు చెప్పాల్సింది చెప్పాను'. అని వెళ్ళిపోయాడుట భగత్ బాగా ఆలోచించాడు. మిత్రుడు చెప్పిందే సబబుగా తోచింది. అలాగే చేసి కీర్తిమంతుడయినాడు.

బావా! పూర్ణా! నేను నీకు జ్ఞాతినికాను. నీ బిడ్డల శ్రేయస్సు కోరేవాడిని. స్త్రీ హత్యాపాతకం కాల్చి వేస్తుంది సుమా. కొడుకూ, కూతురూ బాగా అభివృద్ధిలోకి రాబోయేవారు, నువ్వు నిర్ణయించిన సంబంధాలు తోసిరాజని, వేరే మతస్థులని చేసుకున్నారు. దాంతో వుద్రేకపడిపోయావు బావా! ఆ తంతి పగటిపూట వచ్చినా బాగుండేది. సరిగ్గా భోజనం చేస్తుండగా రాత్రి పది టికి వచ్చింది. వాకిట్లో నీతో పనిబడినవారు వేచివున్నారు. అక్క కాంతిమతి భోజనం పెడుతున్నది. ఇంకా తాను తినలేదు నువ్వు కానివ్వాలి. తర్వాత తాను తినాలి. అత్తగారు ఫలహారం కానిచ్చి, చల్లగాలికి దొడ్లో మంచంమీద నిద్రబోతున్నది. నాలుగేళ్లునిండి అయిదవయేడు వచ్చిన చివరి బిడ్డ చాపమీద నిద్రబోతున్నాడు నీకోసం యెదురు చూసి, చూసి నిద్రబోయాడు. మొదటి మంచీ పిల్లలను అజమాయిషీ చేయడం చాతకాదని అక్క కాంతిమతిని తప్పు పడుతూనే వున్నావు. అది కాకపోతే మరో తప్పు కనబడేది. కాలం గమనించలేదు. వేష భాషలు మారినై. ఆచార వ్యవహారాలూ మారినై, చదువులు మారినై. యేమీ గమనించవు. సంపాదనా, హోదా, అధికారమూ, గౌరవమూ అవే చూసుకున్నావు. ఒక్క పెళ్ళి విషయంలో తప్పితే

పిల్లలు మరేపొరపాటూ చెయ్యలేదు. అదీ గమనించలేదు నువ్వు స్నేహాలేర్పడుతాయి, స్నేహితులు ప్రోద్బలం చేస్తారు. ఏదో అకర్షణకి లొంగి పోతారు పిల్లలు. నువ్వదీ వూహించలేదు. అన్నిటికీ భార్యే టార్గెట్. ఆమెమీద విరుచుకు పడటమే మగతనం అనుకున్నావు. యెందుకు లోకువైంది? నోరు లేదు గనక. గండాగ్రిగొండి మనిషి కాదు గనక. బావా! కోపం రాంగానే గొడ్ల పాకలోకి వెళ్ళి యేదైనా గొడ్డుని బాదే అలవాటు చేసుకోకపోయినా?

ఒక శాస్త్రుర్లు ఒక దొంగగొడ్డు తన పొలంమీదపడి రాత్రిళ్లు మేస్తున్నదని గొడ్డు యజమానికి వార్నింగ్ యిచ్చాడు. వాడు పట్టించుకోలేదు. వాడు రైతు. రాత్రి కాపలా పడుకున్న శాస్త్రుర్లు చూశాడు. గొడ్డు కంచె దాటి రానేవచ్చింది. చేపాటి కర్ర అందుకుని ఒక్కటే దెబ్బవేశాడు శాస్త్రుర్లు. దున్నపోతు చచ్చింది. కేసైంది. అంతా వివరించి వార్నింగిచ్చినా రైతు వినిపించుకోలేదని చెప్పి, నేరం ఒప్పుకోని పరిహారం కింద దున్నపోతు వెల చెల్లించి, మరొక మంచిదున్నపోతును కొనుక్కోమని రైతుతో చెప్పి కేసు కొట్టేయించుకొన్నాడు శాస్త్రుర్లు. నువ్వుగూడా అటువంటి పనిచేస్తే బాగుండేది. అని విషాదంగా నవ్వాడు.

మజ్జిగా అన్నంలోకి వచ్చేశావు. మజ్జిగ వడ్డించటానికి దగ్గరగా వచ్చి వంగింది. ఉడికి పోతున్న నువ్వు నిగ్రహం కోల్పోయి, దూషించి, నెట్టేస్తే గిన్నె అక్కడపెట్టి పోయి దూరంగా కూచున్నది.

నేనందుకే, అ చదువుచాలు. పెళ్ళి చేయండి అని నావేపు సంబంధాలు చూపిస్తే, వాళ్ళకి ఆస్తి చదువూ లేదని, మర్యాదలు తెలియవని తిరస్కరించి. యిలాగే కోపం తెచ్చుకున్నారు మనకు వెరుస్తారు వియ్యాలవారు అని చెపితే నచ్చలేదు మీకు అన్నది కాంతిమతి.

యెదురు చెప్పిందని, పిల్లలపక్షం మాట్లాడిందని, ఇంట్లో గౌరవం పోతున్నదని, యెవరూ వెరవటం లేదని, యింటికి పెద్ద అనుకోనని మెదడు వేడెక్కి, దాపులనే వున్న మంచి గంధపు బొమ్మ, చివరి బిడ్డ ఆడి వదిలేసింది అందుకుని విసిరేసేప్పటికి పక్కకిచూస్తున్న కాంతిమతి కణతకి తాకి పడిపోయింది. అమ్మో అనన్నా అరవలేదు దెబ్బ ఆయువుపట్టు తాకింది.

చెయ్యి కడుక్కు వచ్చి, మనిషి లేవకపోవడం గమనించి నిగూడా, వీధిలోకెళ్ళి పెద్దమనుషులతో మాట్లాడి పంపించి ఇంట్లో కొచ్చి చూస్తే యింకా లేవలేదు. కదలలేదు.

అంతా గలాభా అయింది. నాటు వైద్యుడొచ్చి చూసి 'అంతా అయిపోయిందని చెప్పాడు. నాడిలేదు.' తరువాతదంతా నాటకమే. నయంగాని శూలనెప్పికి తట్టుకోలేక బావిలోపడి బలవన్మరణం తెచ్చుకున్నదని వ్రాసుకెళ్లారు పోలీసులు.

బావా [గేట్ స్కాలర్! మేధావీ! శవపంచాయితీ చేయిస్తే కనీసం వీక్ హార్ట్ లేదా హార్ట్ [టబుల్ ఉందనన్నా సర్టిఫై చేసేవారు. అంతా తారుమారు చేసి పాడు చేశారు. దాన్ని దిద్దాలంటే ఒకటే మార్గం బావా! జీసస్ శిలువ నెక్కినట్టు, వురికంబం

ముందు నిలబడి సత్యమంతా చెప్పి ఉరి పెట్టించుకోవాలి. అదే ధైర్యశాలి చేసేపని. అదే ఆనెస్టీ. అందరూ పోగై, నిన్ను కాపాడుతున్నామంటూ నీ కీర్తి కాపాడుతున్నామంటూ నీ పిల్లల భవిష్యత్తుకి ద్రోహం చేస్తున్నారు. నీ పిల్లలే నీ ఆత్మ. ఆత్మ ద్రోహం చేసుకోకు. ఆత్మ ద్రోహం ధర్మ ద్రోహం ఒక్కటే. బి ఆనెస్ట్. విత్ యువర్ సెల్ఫ్, శరీరాభిమానము వదిలేయి. ఆత్మానందం పొందు. బావా! పూర్ణానందం! అప్పుడే నిజమైన పరిపూర్ణమైన ఆనందం పొందుతావు.

బావా! కాళ్లు పట్టుకోనా? నీకు ధైర్యం లేదేమో. నీ తరపున నేను పెళ్ళి అందరెదుటా యేం జరిగిందీ చెప్పనా? పర్మిష నియ్యి. శోకిస్తూ సాష్టాంగపడ్డాడు విశ్వనాధ సోమయాజులు.

కాని బావా పూర్ణానందం నిలువు గుడ్లు పెట్టుకు చూశాడు. తల అడ్డంగా తిప్పాడు.

అంతమంది పెద్ద మనుషుల్ని కాదని, నువ్వు చెప్పినట్టు వినాలా? నీ తాహతేమిటి? అన్నాడు.

విశ్వనాధం మనసుకి పూరట కలగనే లేదు. మౌనంగా వుంటాడు. నిర్లిప్తంగా వుంటాడు. వేద పాఠశాలకి ప్రిన్సిపాల్ అయినాడు. కాలం దడుస్తున్నది.

ఆఫ్రికాలో పెద్దఉద్యోగం చేస్తు ఆఫీసరై, ప్రజాభిమానం పొందిన కుమారస్వామి పూర్ణానందం బావ పెద్దబిడ్డ. యేదో ఈగ కుట్టి జబ్బుపడిపోయాడు. అక్కడి వాళ్ళు ఖర్చులు భరించి ప్లేన్‌లో తెచ్చారు. యెవర్నీ గుర్తుపట్టలేక, తానెవరైందీ గుర్తు రాకుండానే పోయాడుట కుమారస్వామి. కోడలు తన కొడుకు

దీనా అనే మూడేళ్ళ బ్బాయితో పుట్టింటికెళ్ళిపోయింది. ముఖ చిత్రం కింద పూర్తి పేరు చూశాడు విశ్వనాథం. తన చేతుల్లో ఆడుకున్న మేనల్లుడు.

విశ్వనాథం మంచి పేరు తెచ్చుకుని, సాంస్క్రిట్ ప్రొఫెసరుగా పట్నం వెళ్ళాడు. సంస్కృత పత్రికకి యెడిటరైనాడు. ఆనాడు పేపరు విప్పంగానే కొట్టొచ్చినట్టు ఫ్రంట్‌పేజీ మీది ప్రకటన షాక్ యిచ్చింది. ప్రసిద్ధ ఆస్థాన విద్వాంసులు పూర్ణానందంగారి రెండవ కొడుకు గౌరీనాథశాస్త్రి ఆశ్రమం నడుపుతూ, యోగవిద్య నేర్పేవారు, ఆరోగ్యం పొందటానికి శిష్యులు వచ్చేవారు. వారి ఆశ్రమంలో వెండి బంగారాలతో పాటు, స్మగుల్డ్ సరుకులు, ఆయుధ సామాగ్రి, మందుగుండు సామాను, హీరోయిన్, మారణాయుధాలు దొరికాయి. మెరుపు దాడి జరిగి పట్టుబడి అరెస్టయినారు. కాని శిష్యులు తప్పించ గలిగారు. నక్సలుస్లకిడి టెర్రరిస్టులకీ తర్ఫీదిస్తున్నాడని వెల్లడయింది. కాని గౌరీనాథ శాస్త్రిని రెండవసారి పట్టుకోలేక పోయారు. పారిపోతుండగా పేల్చి చంపివుండచ్చని పుకారు పుట్టింది. అడవిలో యేదో శవం బాగా పూరిపోయింది. తెచ్చి చూపించారు గానీ, యెవరూ గుర్తు పట్టలేదు. దేశదిమ్మరి అయినాడేమోనని వూహాగానం, శ్రీలంక వెళ్ళిపోయి టైగర్స్‌తో కలిసిపోయాడని మరో నీలి వార్త. శిష్యులు చెల్లాచెదరైపోయారు. భార్య ఆరోగ్యం కేథవిమ్‌లో అమ్మాయి తన ముగ్గురు బిడ్డలతో తన వంతు ఆస్తి స్వాధీనం అయిన వెంటనే పుట్టింటికి కేరళ వెళ్ళిపోయింది.

విశ్వం నిట్టూర్చాడు.

విశ్వం కాన్ఫరెన్సుకి ఆహ్వానింపబడి స్వంతవూరు వెళ్ళాడు. మతసంబంధమైనదా కాన్ఫరెన్సు. ఒక్కొక్క మతాన్ని గురించి ఆ మతాచార్యుడు స్పీచ్ యిస్తాడు. విశ్వనాథం దర్శనాద్వైతం మీద స్పీచ్ యిచ్చాడు. ఒక మతానికీ మరొక మతానికీ భేదభావం లేదు. అల్ విజయన్స్ ఆర్ ట్రు అని చెప్పకెళ్ళారు. హర్షధ్వానాలు విన్నాడు. బయటికొస్తుంటే మూడోమేనల్లుడు శౌరి యెదురుగా వచ్చి కౌగలించుకున్నాడు వెంటబెట్టుకెళ్ళాడు.

ఫిల్మ్‌ఫీల్డ్ నుంచి విరమించుకున్న ఒక ఎక్‌స్ట్రా తార యింట్లో వుంటున్నాడు శౌరి. ఆమెకి ఒక కొడుకు.

శౌరి కోచింగ్ సెంటర్ నడుపుతున్నాడు అందులో తార కొడుకు చదువుతున్నాడు. ఎమ్‌సెట్, ఆసెట్, లాసెట్ ఎంట్రెన్స్ పరీక్షలకి కోచింగ్ యిస్తాడు శౌరి. సెంటర్ స్ట్రెంగ్త్ బాగానే వున్నాది. ఆదాయమూ బాగుంది. తార కొడుకు దిలీప్‌కి శౌరి గాడ్ ఫాదర్, గార్డియన్. భోజనం పెట్టించాడు శౌరి. విశ్రాంతిగా బెడ్‌రూమ్‌లో పక్కల మీదున్నారిద్దరూ.

"నన్ను గురించి వివరాలెందుగ్గానీ శౌరీ! నిన్ను గురించి విందాం. ఢిల్లీ రేడియో స్టేషన్లో, డైరెక్టర్‌గా పని చేస్తున్నావని విన్నా. మరొకసారి దూరదర్శన్ కేంద్రంలో మంచి పొజిషన్‌లో వున్నావనీ విన్నాను. ఇక్కడున్నావేం?" గిరున తిరిగే సీలింగ్ ఫాన్‌వంక చూస్తూ అడిగాడు విశ్వనాథం.

"పైకి పెద్ద వుద్యోగమల్లే, కీ పొజిషనల్లే వుంటుందిగానీ అంకుల్! చాలా మెళుకువగా మెలగాలి. మెరిట్ ముఖ్యంగాద.

కులపాంత్రిపదికలు ముఖ్యం. యెవడి చేతిలో ఏవరు వున్నాడో వాడి కులస్థుడి జీవితం జాబ్, నిరపాయకరంగా, ఒడిదుడుకులు లేకుండా వుంటుంది అంకుల్. అక్కడా పాలిటిక్స్ వున్నాయి. తెలివితేటలూ, మంచితనం, సమర్థతా గాదు ముఖ్యం. యెప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికా మాటలాడి నెగ్గుకురావాలి. మోసానికి లౌక్యమని పేరు పెట్టి గెలవాలి. స్త్రీలనూ మెప్పించాలి. ఇవన్నీ నెగ్గుకు రావాలి. నీకర్థమయేట్టు చెపితే అసహ్యించుకుంటావేమో" అని నవ్వాడు శౌరి.

మంచం మీద పడుకుని గూడా సిగరెట్ తగలేయటం పక్కన బల్లమీదున్న యాష్ ట్రేలో, కిటికిన వేలుతో సిగరెట్ దులపటం శౌరికి యిష్టం. లైటర్‌హిమేశా జేబులోనే వుంటుంది. శౌరి చెయిన్ స్మోకింగ్ గమనించాడు విశ్వనాథం. రెండుసార్లు సిగరెట్స్ అందకుండా దాచేశాడు. శౌకిరి అర్థమై, మామ ఉపేక్షకు సంతోషించి నవ్వాడు.

"నీకు పెళ్ళి అయిందని విన్నానే. ఆమె ఓద్దుకు రాలేక పోయిందీ? ఆమెకు లోబడలేదూ నువ్వూ?"

"నాకు మమ్స్ అనే వ్యాధి వచ్చింది. ఆమె యేమో ఎక్సరే డిపార్ట్‌మెంట్‌లో వుద్యోగం చేసింది. వయస్సు దాచి తక్కువ చెప్పింది. మేకప్ యెక్కువ చేస్తుంది. కనుక్కోలేం. రిప్రొడక్షన్ యేజ్ దాటింది. బిడ్డలు కలక్కపోవటానికి కారణాలవి. హిస్టీరియా వచ్చింది. జెలసీ అనుమానం యెక్కువయాయి. శృంఖించి యెవర్నీ రానీయలేదు. తననే కని బెట్టుకుని యింటిపట్టు నుండమన్నది. యేడిపిద్దామనిపించి, నవ్వుతూ అన్నాను.

'నాకు వచ్చిన జబ్బుకి సంతానం కలిగే అవకాశం పోయింది. పోతే యేం?' అంటుండగానే, యింగ్లీషువారు యిండియా వదిలిపెట్టి వెళ్ళినట్టు, యిల్లంతా చిందరవందరచేసి, మెంటల్ డిసీజ్‌తో వెళ్ళిపోయింది. తల్లి ఆస్తి, బాంక్ బాలెన్సు కూతురుకే చెందేట్టు వీలువ్రాయుటంవల్ల, నా భార్యకే చెందినై. మేనల్లుడు అడ్వొకేట్. వాడి దగ్గరున్నది మెడ్రాస్.

వెళ్ళి తెచ్చుకోలేదూ? శౌరిని చూస్తూ అడిగాడు.

నా పరిస్థితులు మరీ విషమించినై. పొలిటికల్ రికమెండేషన్స్‌కి లొంగమంటారు. ప్రాణాంతకం, అసమర్థులకు జాబ్సు యివ్వాలి. రిజైన్ చేశాను. మెడ్రాస్ వెళ్తుంటే ప్లేన్‌లో, ఒక మిత్రుడు, ఫిల్మ్‌ఫీల్డులో పలుకుబడి వున్నవాడు పట్టుకున్నాడు.

మంచి పర్సనాలిటీ, చక్కని వాచికం వున్నది. వుద్యోగమెందుకూ? మీ కులదైవం శివునిపాత్ర వేతువుగానిరా. అని జిడ్డు పట్టుకున్నట్టు పట్టుకున్నాడు. అదుగో ఆ స్టుడియోలో యీ ఎక్స్‌ట్రా పార్వతి వేషం వేసినామె నన్ను తగుల్కొన్నది. తప్పించుకోలేకపోయినా. నాకు పోయేందుకేమున్నదీ? నాక్కావాల్సింది నేను సంపాదించుకోగలను. అగాడు.

ఆస్తి వుండాలే, సంశయ నివృత్తికోసం అడిగాడు.

నాన్న సన్యసించాడు. నీకు వార్త అందలేదేమో. శంకర మఠానికి వెళ్ళిపోయాడు. అక్కా బావా దగ్గరున్నా. బావ భాగాలు పంచేశాడు. అక్కను చెల్లించి, బిజినెస్ పెడ్తున్నానని చాలా అమ్మించాడు. షేర్లు కొన్నాడు. నష్టపోయాడు. నాన్న

యిచ్చిన కొద్ది భూమిమీద, మామిడితోటలో, పాక వేయించి, అమ్మ యిచ్చిన యకరం పొలం మీద ఆదాయంతో అక్క నెట్టుకొచ్చింది.

రెండో అక్క దేవీ?

విషజ్వరం వచ్చి పోయిందన్నారు. మేం వురుకులూ, పరుగులమీద వెళ్ళినా చూపులన్నా అందలేదు. సంస్కారం ముగించేశాడు బావ. బావ తన పిల్లల్ని తీసుకుని మైసూర్ వెళ్ళిపోయాడు. పట్టుచీరల వ్యాపారం చేస్తున్నాడుట. మేమె వరమూ రాగూడదని బంధువుల చేత చెప్పించాడు.

మూడోసోదరి.

శౌరి అందంగా నవ్వాడు. స్వంత వ్యవసాయం చాతకాక పొలం అమ్మేసి, ఆ డబ్బుతో శాయిబాబా గుడి కట్టించి, థియేటర్ రన్ చేస్తున్నట్టు రన్ చేస్తున్నారు. హరికథలు, పురాణం, డిస్కోర్సెస్, దేవునికి కళ్యాణం, అభిషేకం, అన్నిటికీ టికెట్ కొనాలి. బ్లాక్ బోర్డుమీద వివరాలు వ్రాసి వుంటాయి. పక్కన రావిచెట్టూ, దానికింద పుట్టా వున్నాయి. నాగప్రతిష్ఠ చేశారు. దానిమీద ఇస్కం వున్నది. శౌరి నవ్వుకుంటున్నాడు.

విశ్వనాథం సీలింగ్ ఫాన్‌వంక చూస్తున్నాడు. పంకా యెంత త్వరగా తిరుగుతున్నదో, కాలం అంత త్వరగా పరుగెత్తుతున్నది.

తక్కువ వాళ్ళని గురించి వినాలని లేదా, అంకుల్! ఇంకో అక్కా బావాకి గంపెడు పిల్లలు. పాకలో వుంటే చూడ

లేక, నా యింట్లో వుండమన్నా. బావ తిండికి తిమ్మరాజా పనికి పోతరాజూ. ఇగో. దర్పం. యే పనీ చేయడు. అవమా నిస్తారుట. డిగ్రీ లేదుట. పొలం మీదొచ్చేది సరిపెట్టుకుంటాను అనేవాడు. పిల్లలకి, పెళ్ళీ చదువూ చూడాల్సివచ్చి పొలం అమ్మేశాడు. వచ్చినపని అయిపోయినట్టు అర్థాంతరంగా పోయినాడు. వాళ్ళక్కకి తోడు వెళ్ళాడు. కాశీపెళ్ళి గంగా స్నానానికి వెళ్ళారుట. ప్రవాహ వేగానికి అక్క కొట్టుకుపోన్న దని రక్షించటానికి నది మధ్యకి వెళ్ళాడుట తెచ్చి ఒడ్డున పడే శాడు అక్కని. కాని మరొక యిల్లాలిని, ఆమె భర్త రక్షించమని లబలబలాడితే మళ్ళా వెళ్ళాడుట. భర్తకు భార్యనిచ్చాడుగానీ, మొసలి వేసుకపోయిందిట. బావ గజ యీతగాడు. మోటబావి, దిగుడు బావి, కృష్ణానది, గోదావరి నదుల్లో, ప్రమాదవశాత్తూ పడినవారిని, కులభేదం గూడా లెక్కచేయక, కాపాడటం చూశాను అంకుల్. ప్రాణం మీద తీపిలేదు. తుఫానులో చిక్కు కున్న గొడ్లను, పక్షుల్ని, మనుషుల్నీ కాపాడటం కళ్ళారా చూశాను అంకుల్! అక్కకీ డిగ్రీ లేదు. బలశాలి బావను కోల్పోయి చూస్తూ కూచునేది. అక్క స్నేహితురాలు.

'గురువు వేషం వేసీ, ఉపదేశాలు చేసీ, రామాయణం గానం చేసీ, స్త్రీల మఠం నడిపీ సంపాయించుకోవచ్చు. రా' అని పట్టుకున్నది. 'పిల్లలకి, తిండీ బట్టా, చదువూ, కావద్దా!' అని నవ్వింది ఫ్రెండ్. మా అక్క మా నాన్న దగ్గరే వుపదేశం పొందింది. చాలా మంత్రాలొచ్చు. నాన్న దగ్గరే చదువు కున్నది. నవ్వుతూ ఆ స్నేహితురాలితో వెళ్ళిపోయింది. ఇల్లు చిన్నబోయింది. ఇల్లు పాతది. వుండలేకపోయినా. అమ్మేశా.

చివరి అక్కకి సంతులేదు. బావకి బాగా బి. పి. ఉన్నదట! నిర్లక్ష్యం చేశాడు. పెరాలిసిస్ వచ్చింది. జాబ్‌చేయలేకమానే శాడు. అక్కపొలమ్మి నగలమ్మి వైద్యం చేయించింది. లేచి తిరిగాడు. కుడిచేయ్యీ, కాళ్లూ బాగారాలేదు. పట్టుకుంటే నడు స్తాడు. వీల్ ఛెయిర్ కొన్నది అక్క. ఆయనవేపు వాళ్లు వస్తూ పోతూ వుండేవాళ్లు. వాళ్లతరహా నచ్చక అక్క తిరగబడింది.

"నీ పర్మిషనూ నీవాళ్ల పర్మిషనూ కావాలానాకు? అంబష్టు డల్లే, అష్టావక్రుడల్లే అయిన నువ్వా నాకు సలహా యిచ్చేది? యెవరి సెన్ను కోవాలో నాకు తెలియదా? చాతగాదంటున్నావా? చూపిస్తా" అని తెగించింది. ఇంకవినలేవు అంకుల్. ఊహించు "శౌరి చిటికవేసి సిగరెట్ దులిపి చూస్తే విశ్వనాథం మంచి నిద్రలో ఉన్నాడు. గుండెలమీద చేతులు కలిపి వున్నాయి.

## 3

విశ్వనాథానికి శిష్యులు పెద్ద సెరిమొనీ తల పెట్టారు. షష్ట్యబ్దిపూర్తి యెలాగో తప్పించుకో గలిగాడు గానీ, విశనాథం నేడు అశక్తుడైనాడు. సహస్రమాస జీవిఅనీ, సహస్రచంద్ర దర్శనం చేశాడనీ, ఆయనకి శిష్యరికం చేసినవాళ్లంతా సత్ప్ర వర్తనులై, గృహస్థులై మంచిపొజిషన్‌లో వున్నారని పండగ తల పెట్టారు. పంచరత్నాలు వ్రాశారు. పబ్లిక్ చేశారు. సంగీత కచేరీ, హరికథా, నృత్యం, నృత్యనాటికా, ఒక శిష్యుని అష్టావ ధానం, ఒక మిత్రుని శతావధానం, యేర్పాటు చేశారు. విశ్వ నాథం రచించిన "ఇంతేనా జీవితసార మిదేనా?" అనే నాటిక

వేశారు దుశ్శాలువలు కప్పారు. పూలకిరీటం పెట్టారు. బంగారు కడియం చేతికి యెక్కించారు. అన్నదానం, వస్త్రదానం, పుస్తకదానం, జరుగుతున్నది.

ఒక గదిలో మంచం మీదున్నాడు విశ్వనాథం. యెందుకు హంగామా, ఆర్భాటం అనుకుంటున్నాడు. తన బావను ఒప్పించలేక పోయాడానాడు. రాగద్వేషాలు, జయించలేని వాడికి సన్యాసమెటువంటి శాంతినిస్తుంది?

గురువుగారూ! మీకోసమెవరో వచ్చి వాకిట్లో నిలబడి వున్నారు శిష్యుడన్నాడు.

లోపలికి తీసుకురా. లేవలేను.

రెండు నిమిషాల తరవాత వాకిలివంక చూస్తే శౌరి నిలబడి కనిపించాడు. అచ్చం తల్లి పోలికే.

రా. కూచో శౌరీ! అక్కడే నిలబడి వున్నావేం! చెయ్యి వూపి పిలిచాడు. మంచం మీద జరిగి, కూచోమని చూపాడు. శిష్యునివంక చూస్తే గ్రహించి తలుపు మూసి వెళ్ళిపోయాడు.

యేదైనా ఫంక్షన్ అటెండ్ కవటానికి వచ్చావా? స్నేహితులతో వచ్చావా? అంకుల్ని చూడటానికి చాలా దూరం వెతుక్కుంటూ వచ్చావు.

పేపర్లో చదివాను. నువ్విక్కడున్నావని తెలిసివచ్చాను. నేడు నగరంలో కార్యక్రమాలు అనేది చూసి, నిన్ను చూడాలనే వచ్చాను అంకుల్! పక్కమీద కూచుని మామవంకే చూస్తు చెప్పుకెళ్ళాడు.

పెద్ద వదిన రాజకీయాలలో దూరింది. పార్టీలు ఫిరాయిస్తు పదవులలంకరిస్తు వస్తున్నదని తెలిసి సంతోషించాను. కాని అంకుల్! మర్డర్ కేసులో కంఠంవరకు దిగబడిందని తెలియంగానే సంతోషమంతా డస్టర్‌తో తుడిచేసినట్టు చెరిగిపోయింది అంకుల్. యెంతైనా వదిన గదూ. పిల్లవాడినీ కస్టడీలోకి తీసుకున్నారని పేపర్లో చదివి వికలమైపోయినా. వాడు ప్రాక్టీస్ చేసుకోటమెట్లా? నాకు తెలిసిన క్రిమినల్ లాయరున్నాడు. వాడి సహాయంతో కొడుకునన్నా విడిపించగలనేమోననే ఆశతో స్నేహితులతో మాట్లాడి ట్రై చేస్తు వచ్చాను. వదినకి బెయిల్ యివ్వరుట. స్మగుల్డ్ సరుకుల నేరం, కల్తీమందు లమ్మిన నేరం, మత్తు పదార్థాల రవాణాకి సాయపడిందనే నేరమూ వున్నాయి. కొడుకునన్నా కాపాడాలని చూస్తున్నాము అంకుల్! మొహం తుడుచుకున్నాడు.

నీ కోచింగ్ సెంటర్ యెవరు చూస్తున్నారు? టాపిక్ మార్చి శౌరి కలవరం వుద్రేకం తగ్గించాలని చూశాడు విశ్వనాథం. శౌరి అదీ గ్రహించాడు. ఇంకా వివర్ణమైనాడు.

రెండో వదిన తన తమ్ముడికి హామీ వుండి నష్టపోయింది. తమ్ముడు గల్ఫ్‌దేశాలు వుడాయించాడు. పిల్లల చదువులాగిపోయి డబ్బులేక, పరపతి లేక చిన్న చిన్న జాబ్స్‌లో చేరారు. పెద్దకోడలు టీనేజరే, ఫిల్మ్‌ఫీల్డులోకెళ్తూ మోసపోయి వంచనకు తట్టుకోలేక అత్తగారి దగ్గరకొచ్చింది ఆశ్రయంకోసం. వదినా, వదినా, కొడుకూ వెళ్ళగొట్టారు.

లాభం లేదని గ్రహించి, విశ్వనాథం లేచాడు.

నువ్వు విశ్రాంతి తీసుకోవాలి శౌరీ! మొహం చాలా యెర్రబడింది. ఆయాసపడుతున్నావు. భోజనం చేసి నిద్ర తీయాలి. నిద్ర మంచి మందు. పద. తలుపు తీయగానే శిష్యుడొచ్చాడు.

వీడు మా అబ్బాయి. స్నానం భోజనం అమర్చాలి.

4

విశ్రాంతి లభించాక కొంత తేటగా కనిపించాడు శౌరి. ఆ రాత్రికి యేమీ తినలేనన్నాడు. కడుపులో బాగలేదన్నాడు. మంచం మీదున్నాడు. విశ్వనాథం పక్కనకుర్చీలో వున్నాడు.

తినగలిగినంతే తిను. కడుపులో బాగా లేదా? మనసులో బాగా లేదా? వ్యాధికి మందున్నది. ఆధికి లేదు. ఊరట కలిగించుకోవాలి. విశ్వనాథం వోదార్పుగా అంటున్నాడు.

శౌరి వుద్రేకపడి, ఒక చేతి మీద లేచి, మొహం యెఱ్ఱబడేసుకుని అన్నాడు. పెదిమలు అదురుతున్నై.

యెట్లా కలుగుతుంది అంకుల్! మా అమ్మ ఆత్మహత్య చేసుకున్నదని ప్రచారం చేశారు. కాని అంకుల్! మా నాన్న మా అమ్మను కొట్టి చంపేశాడు. అది మర్డరేనని తెలిసింది. నిజం పైకి వచ్చింది. యెందుకని నొక్కిపెట్టారు? మా నాన్న నెందుకు అరెస్ట్ చేయలేదు? యెందుకు కాపాడారు?

"చాలా గొప్పవాడని, మన వూరువాడని, వూరికి కీర్తి తెచ్చాడని" "అదుగో అంకుల్! నువ్వు గూడా ఒప్పుకున్నట్టే, తెలిసే చెప్పలేదు నాకు. ఒప్పుకోమని మా నాన్నమీది కెందుకు వత్తిడి తేలేదు నువ్వు?"

సన్నని నవ్వు విశ్వనాధం పెదిమలమీదికి పాకింది.

“జనకు జయుడు వ్యాసమహర్షి నిలాగే తప్పు పట్టాడు.

‘తాతా! తెలిసే చూస్తూ కూచున్నావు. సమర్థత వుండీ! యుద్ధాన్ని ఆపలేదు. అందరూ పోయారు. యెంతగొప్పవాళ్లు!?

దానికి తాత అన్నాడు. “మంచి చెపితే వినలేదు మన మడా? అయిపోయిందేదో అయి పోయింది. నీకు మంచి చెపుతాను. నేను చెప్పినట్టు వింటావేమో చూతాము’ అలాగా శౌరీ! యెంతచెప్పినా, మొత్తుకున్నా, కాళ్ళమీద పడ్డా మీ నాన్న వినలేదు. డబ్బు విరజిమ్మమన్నారు బంధువులు. ఆ పని చేశాడు. ఆఫీసర్లు కేసు కాకుండా పోస్టమార్టమ్ జరక్కుండా చేయగలిగారు. ఆనాడు నన్ను నమ్మేవారెవరు? ఆనాడు నాకు విలువ వున్నదా? ఆయన పెంచినవాడినీ, ఆయన్ని ఆశ్రయించుకుని వున్నవాడిని. ఆయన్ని వీధిన పెడుతున్నానంటారా నాడు. ఉత్తరీయంతో మొహం అద్దుకున్నాడు విశ్వనాధం. ఉత్తరీయం తీసి చూస్తే శౌరి బాధపడుతున్నాడు.

అంకుల్! తల తిరుగుతున్నది. కడుపులో తిప్పుతున్నది. వాంతి అయేట్టున్నది. మా అమ్మ బావిలో కూచుని ఒళ్ళో రాయి పెట్టుకుని బలవన్మరణం తెచ్చుకున్నదన్నారు. అది నిజం గాదు. అవిడనట్లా కూచోబెట్టి నలుగుర్ని తెచ్చి చూపి సాక్ష్యం చూపించారు, కల్పించారు. బావి లోతు లేదు. మా అమ్మ పొడగరి. బాధ యెక్కువ కాసాగింది.

విశ్వనాథం లేచివెళ్ళి, డాక్టర్ని తెమ్మని శిష్యునితో చెప్పి వచ్చాడు. శౌరికి వుపచారం చేస్తుండగా డాక్టరు వచ్చాడు.

శౌరికి మొహాన చమట బిందువులు యేర్పడుతున్నాయి.

పరీక్ష చేస్తు డాక్టరడిగాడు. వయసెంతండీ?

ముప్పై యెనిమిది.

గుండెపోటు వచ్చిందండి. ఇంతకుముందు వచ్చిందా?

నానా! శౌరీ! వినబడిందా? చెప్పగలవా? యెవరు చూశారు? యెన్నాళ్ళైంది. భద్రతలు తీసుకోవాలని ఆ డాక్టరు చెప్పలేదా?

ఆక్సిజన్ టెంట్లో వుంచాలి. నలభై వయస్సు లోపున రెండవసారివస్తే లాభం లేదండీ. కదిలించరాదు. గాలి బాగా రానీయండి. కదలకుండా పడుకోనీయండి. ఈ దగ్గర్లోనే నర్సింగ్ హోమ్ వున్నది. తట్టుకోగానే తీసికెళ్ళి టెంటులో వుంచుదాం, లేదా టెంట్ తెప్పిద్దాం. ఉపశమనానికి, డాక్టరు ఇంజక్షనిచ్చి వెళ్ళాడు.

అంకుల్! నువ్వు మా నాన్నని షూట్ చేయాల్సింది శౌరి కనుకొలకులనుంచి నీరు రాల్తున్నది.

నానా! శౌరీ! మాట్లాడరాదు. అదంతా గతజల సేతు బంధనం. పూరట పొందాలి. కంట్రోల్ చేసుకో. ఉద్రేకపడకు. మృత్యువు సహజం. భగవంతుని అర్థం చేసుకొనటం ముఖ్యం. నుదుటిమీదా, గుండెలమీదా రాస్తూ అన్నాడు విశ్వనాథం.

యెట్లా? అంకుల్! అసాధ్యమవుతున్నాది.

కదలకు. విను. కర్ణుడు తనకు సోదరుడని తెలిశాక, అన్నను చంపుకున్నానే అని అర్జునుని దుఃఖం కట్టలు తెగింది. కృష్ణుని కాళ్ళు పట్టుకున్నాడు బావా! యీ పాపం యెట్లా పోతుంది? అని విలపించాడు. వెఱ్ఱివాడా! అర్జునా! పాపమేదీ? అవన్నీ అలా జరగాలని ముందే నిశ్చయమైంది. నీ వొక్కడి వేనా దోషివి? నీచేతను, నాచేతను, వరమడిగిన కుంతిచేత, వాసవు చేతన్. లే. లే అని వూరడించాడు కృష్ణుడు. లేనిపోని వ్యధ కల్పించుకోకు. నీకింకా చాలా జీవితమున్నది. రాస్తున్న చేతిని పట్టుకున్నాడు శౌరి.

అంకుల్! నీ దగ్గరనాన్న వున్నాగాదు. కొంతనాన్న బాగు పడేవాడిని. లేనిపోని నిందలన్నీ వేశారు. కోచింగ్ సెంటరని పేరుపెట్టి, స్వేచ్ఛాజీవితం నేర్పుతూ, పిల్లల్ని తల్లిదండ్రులకెదురు తిరగమని నేర్పుతున్నానన్నారు సంఘభీతి లేకుండా చేస్తున్నానుట. సెంటర్ క్లోజ్ చేశాను. అన్నీ అమ్మేశాను. 'పోయి బాగుపడండి' అని చెప్పాను. పిల్లలు యేడిచారు. అంకుల్! నూటికి నూరుగురూ పాసైనారు. నవ్వు మొహాలతో వచ్చారు. నాకానందమిచ్చారు. అంకుల్! సన్యాసం పిచ్చిపని. రాగద్వేషాలను జయించటం చాతగానివాడికి సన్యాసమెందుకు. అంకుల్! ఇంతమంది మధ్య వుండీ, యిన్ని సేవలందుకుంటున్న నువ్వు నిజమైన సన్యాసివి. అలా అంటూ అంకుల్ చెయ్యి వదిలి తలవాల్చేశాడు శౌరి.

నాన్నా! శౌరీ! పలకవా? అంకుల్ అని పిలవవా?

విశ్వనాథం రోదనం అరణ్యరోదనమైంది.

— ౦ —